కథా నిలయం
3497
శ్రీకాకుళం

ఎఱ్ఱజెండా

(రషియాదేశపు కథ)

— సెవొలోడ్ మిఖలోవిచ్ గార్షిన్

'సీమన్ ఇవనోవ్' — రైల్వే లైనుమీద కాపలావాడు, అతడు కాపురమున్న యింటికి పన్నెండు వెర్‌స్టుల* దూరమున ఒక రైలు స్టేషనున్నూ 10 వెర్‌స్టుల దూరమున ఒక రైలు స్టేషనున్నూ ఉన్నవి. అక్కడకు నాలుగు వెర్‌స్టుల దూరములో ఒక మిల్లు నిరుటి సంవత్సరము కట్టినారు. దాని ఎత్తైన నల్లని చిమ్నీ (పొగస్తంభము) అడవిని దాటి కనిపించుచున్నది. ఇంతకు సమీపములో యితడు కాపురమున్న యింటివంటి కాపలావాళ్ళ తప్ప, మనుష్యులు కాపురముండే యిళ్ళు లేవు. 'సీమన్ ఇవనోవ్' వ్యాధిగ్రస్తుడు. చాలా చితికిపోయాడు మనిషి. తొమ్మిది సంవత్సరములకు పూర్వము ఒక సైనికోద్యోగివద్ద, వార్తలు కొనిపోయే సైనికుడుగా ప్రవేశించి యుద్ధమయ్యే పర్యంతము అతని కొలువులోనే ఉన్నాడు. అతడు ఆకలివేసి బాధపడ్డాడు, చలిలో వడవడ వణికాడు; ఎండలో మలమల మాడాడు; ఘాళుపులుగా ఉన్నప్పుడూ, హిమము కురిసేటప్పుడూ నలభై యాభై వెర్‌స్టుల దూరము నడిచాడు; ఫిరంగిబారుల కెదురుగా ఉన్నాడు; — కాని దైవ బలముచేతకాబోలు ఒక్క తుపాకిరవ్వ అయినా అతన్ని రాసుకుపోలేదు. పూర్తిగా ఒక వారము రోజులు, సైనికదళము సైన్యముఖమున ఉండెను. ఆ రోజులలో వారూ, వారి కెదురుగా పల్లములో ఉన్న తురుష్కులూ ఎడతెగకుండా ఫిరంగుల బారు పెట్టుకుంటూనే ఉన్నారు. ఉదయము మొదలు సాయం

* "ఒక వెర్‌స్టు 2/3 మైలుకు సమానం."

కాలము వరకూ కాల్చడం ఆగలేదు. సీమన్‌యొక్క కామందు సైన్యముఖములోనే ఉన్నాడు. రోజుకు మూడుమార్లు, అతడు తన ఉద్యోగస్థునకు, కొండచరియలో ఉన్న సైనికుల వంట యింటి నుండి టీ కాచే పాత్రా, భోజన సామగ్రీ తీసుకొని పోయేవాడు. వంటయింటి నుండి టీ పాత్ర పట్టుకొని ఉద్యోగస్థుని దగ్గరకు వెళ్ళడానికి ఒక బయలు దాటవలసి ఉన్నది. తుపాకిగుళ్ళు విజ్ఞుమని అతని సమీపము నుంచి పరుగెత్తి రాళ్ళకు తగిలి శబ్దము చేసేవి. సీమన్ భయపడి ఏడ్చేవాడు. కాని తాను వెళ్ళడం మాత్రము మానలేదు. ఉద్యోగస్థులందరూ అతన్ని చాలా మెచ్చుకొన్నారు — ఎప్పుడూ వారికి వెచ్చ వెచ్చని టీ దొరికేదీ! యుద్ధములో గాయపడకుండా అతడు తిరిగి వచ్చినాడు కాని పాపము కాళ్ళలోను చేతుల్లోను నొప్పులు పట్టుకొన్నవి. అప్పటినుంచీ అతడు చాలా చిక్కులు అనుభవించాడు. ఇంటికి వెళ్ళాడు—అతని తండ్రి కాలం చేశాడు; నాలుగేళ్ళ కొడుకుకూడా గొంతుకలో జబ్బుచేసి మరణించాడు. సీమనూ అతని భార్యా మాత్రం మిగిలారు. వ్యవసాయం చేస్తే పని సాగిందికాదు. ఎల్లా సాగుతుంది? కాళ్ళూ చేతులూ వాచిపోయి ఉంటే భూమి దున్నడం ఎలాగ? ఇంక స్వగ్రామంలో ఉండడం ఇష్టంలేక సౌఖ్యంకోసం వెతుక్కుంటూ కొత్త స్థలాలికి వెళ్ళారు. సీమనున్నూ, అతని భార్యా 'ఖార్‌కోవు'లోను 'డాను' లోనూ రైల్వేలో ఉద్యోగం కోసం, ప్రయత్నించారు. ఎక్కడా వారికి అదృష్టదేవత ప్రసన్నం కాలేదు. కొన్నాళ్ళకు అతని భార్య నౌకరీకి వప్పుకుంది. అతడు తిరగడం ప్రారంభించాడు. ఒకమాటు అతను రైలుమీద ప్రయాణమై వెళ్ళడం తటస్థించింది. ఒక చిన్న స్టేషను దగ్గిర అతడు బయటకు చూచాడు. స్టేషను మేష్టరు తనకు పరిచయుడా ఏమిటి చెప్మా అనిపించింది. సీమన్ స్టేషను మేష్టరుకేసి చూచాడు, స్టేషను మేష్టరు సీమన్ కేసి చూచాడు, ఒకరినొకరు పోల్చుకున్నారు. తాను పనిచేసిన సైనికోద్యోగి యితడేకదా అనుకున్నాడు సీమన్.

"నీవు ఇవనోవ్ కావా?" అన్నాడాయన.

"అవును, దేవరా, నేనే!"

"నీ విక్కడకు ఎలాగవచ్చావు ?"

సీమన్ యావద్వృత్తాంతము అతనితో చెప్పినాడు.

"ఇప్పు డెక్కడకు వెళ్ళుచున్నావు నీవు ?"

"నాకు తెలియదు ; దేవరా !"

ఏమిటి, త్వాష్టం, నీకు తెలియదూ ?"

"అవును, దేవరా, ఎక్కడ పనిచెయ్యడానికి సిద్ధపడినా లాభం లేకుండా ఉంది. ఏదైనా పని దొరుకుతుందేమోనని నేను ప్రయత్నాలు చేస్తూ ఉండవలసిందే కదా దేవరా !"

స్టేషను మేష్టరు అతనికేసి చూచి ఆలోచించి అప్పుడన్నాడు, 'చూడబ్బాయి, ఇప్పటిమట్టుకు స్టేషను దగ్గిర ఉండు. నీకు పెళ్ళి అయిందనుకుంటాను. కాదూ ? నీ భార్య ఎక్కడ ఉంది ?'

"అవును దేవరా, నేను పెళ్ళి చేసుకొన్నాను. నా భార్య 'కుర్‌సక్'లో ఒక వర్తకునివద్ద నౌకరీ చేస్తున్నది."

"సరే నీ భార్యకు ఉత్తరం వ్రాయి ఆమెను ఇక్కడకు రమ్మని చెప్పు, ఆమెకు ఫ్రీ పాసు ఇప్పిస్తాను. కావలావారి యిళ్ళలో ఒకటి త్వరలోనే ఖాళీ అవుతుంది. ఈ సెక్షన్ ప్రధానోద్యోగితో నీ సంగతి చెప్పుతాను."

"నేను కృతజ్ఞుడను దేవరా !"

అందుచేత అతను స్టేషను దగ్గిర ఉండిపోయాడు. స్టేషను మేష్టరు వంటింట్లో అతడు సాయం చేస్తూవుండేవాడు. పుల్లలు కొట్టే వాడు ; పెరడు తుడిచేవాడు; ప్లాటుఫారం తుడిచేవాడు. రెండువారాల్లో అతని భార్య వచ్చింది. సీమన్ తన సామాను ఒక తోపుడు బండిలో పెట్టి తన కావలాయింటికి వెళ్ళాడు. కావలా యిల్లు కొత్తది; వెచ్చగా ఉంది. అతనికి కావలసినంత వంటచెరుకు ఉంది. ఇతనికి పూర్వం ఆ యింట్లో కాపురమున్నవాడు పాదులూ కూరమొక్కలూ పెంచుకు వెళ్ళి పోయాడు. అవి వీరికి దక్కినవి. లైనుపక్క సుమారు అర ఎకరం

దున్నడానికి వీలుగా ఉన్న భూమి ఉన్నది. సీమన్ చాలా సంతోషించాడు. భూమిని ఎల్లా సేద్యం చెయ్యడమో, ఒక ఆవునీ, ఒక గుర్రాన్ని ఎల్లా కొనుక్కోవడమో, ఆలోచించడము మొదలుపెట్టాడు.

అతని పనికి కావలసిన వస్తువులన్నీ అతని కిచ్చారు — ఒక ఆకుపచ్చజెండా, ఒక ఎర్రజెండా, ఒక లాంతరు, ఒక బూరా, ఒక సుత్తి, స్క్రూళ్లు బిగించడానికి రెంచీ, ఒక గునపమూ, ఒక తవుగాలా, ఒక చీపురూ, కొన్ని మరమేకులూ, ఇనపగద్ద గోరులూ, అతనికి రెండు పుస్తకాలు కూడా యిచ్చారు — రైల్వే రూల్సూ, టైముటేబిలూ. మొట్టమొదట సీమన్‌కు రాత్రిళ్ళు నిద్ర పట్టనేలేదు. అస్తమానం టైముటేబిలు చదవడమే. ఇక రెండు గంటలకి రైలు వస్తుందంటే అతను తనబీటు తిరిగి వచ్చి ఇంటివద్ద ఉన్న బెంచిమీద కూచుని చూస్తూండేవాడు — రైలుపట్టాలు అదురుతున్నాయేమోననీ, రైలుబండి చప్పుడు వినిపించదా అనీ. రైల్వేరూల్సు అన్నీ అతనికి కంఠతా వచ్చాయి. వర్ణక్రమం చేసుకుంటూ చదువుకోవలసివచ్చినా అతడు సర్వమూ నేర్చుకోగలిగాడు

అది వేసంగి పని చులాగ్గానే ఉంది. ముద్దమంచు కురియడంలేదు. కాబట్టి అది తీసివేసి బాగుచెయ్యవలసిన పని తప్పింది. ఆ లైనుమీదకు అట్టే రైళ్ళురావు. కాబట్టి సీమన్ రోజుకు రెండుమార్లు తను చూడవలసిన వెర్‌స్టు చూచేవాడు. అక్కడక్కడ ఒక్కొక్క మేకు బిగించడమూ, పట్టాలమధ్య మన్ను సరిగ్గా ఉందా లేదా అని చూడడమూ, పట్టా మధ్య నుంచి నీరు పోవడానికి పెట్టిన కాలవ గొట్టాలు బాగా ఉన్నాయో లేవో చూడడమూ అయిన తర్వాత ఇంటికి వచ్చి భూమి సేద్యం సంగతి ఆలోచిస్తూ ఉండేవాడు. కాని యింటిపనులు చేసుకోడానికి మాత్రం ఒక చిక్కుఉన్నది. అతడు ఏమైనా చేద్దామని అనుకున్నట్లయితే రైలు రోడ్డు మేస్త్రీ ఉత్తరువుకోసం వ్రాసుకోవాలి. ఆ మేస్త్రీ సెక్షను ప్రధానోద్యోగికి రిపోర్టు పంపాలి. ఇవన్నీ అయి అతనికి ఉత్తరువు వచ్చేటప్పటికి పుణ్యకాలం రవంతా అయిపోయేది. సీమన్‌కూ, అతని భార్యకూ చేతినిండా పనిలేక ఏమీ తోచడంలేదు.

రెండు నెలలు గడచినవి. సమీపంలో ఉన్న కాపలావాండ్లతో సహవాసం చేయ మొదలుపెట్టినాడు సీమన్. అందొకడు చాలా ముసలి వాడు. అతడు యిల్లుదాటి బయటకు రావటమునకైనా శక్తి లేనివాడు. అతన్ని తీసివేసి యింకొకరిని ఆస్తానే వేస్తారని గట్టి వదంతి కద్దు. అతని భార్య అతని బదులు లైనుమీద పనిచేసేది, ఇంకో కాపలావాడు బక్కపల్చగా ఉంటాడు. కాని కండలు అవుపిస్తూ ఉన్నవి. కుర్రవాడే. ఇద్దరు బీటులూ కలిసేచోట సీమన్ మొట్టమొదట అతనిని కలుసుకున్నాడు. సీమన్ టోపీతీసి బుర్రవంచి సలాముచేశాడు "ఖులాసాగా ఉన్నావా అబ్బాయీ" అన్నాడు సీమన్.

అబ్బాయి ఓరచూపుతో అతనిని చూశాడు "నీవు ఎలాగ వున్నావు" అని సమాధానం చెప్పి వెనక్కు తిగిగి వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళైన తర్వాత వారి భార్యలు ఒకరినొకరు కలుసుకున్నారు. సీమన్ భార్య 'అరీనా' పొరుగు కాపరి భార్యను పలకరించింది. ఆవిడ ఏవో రెండుముక్కలు చెప్పి వెళ్లిపోయింది సీమ నొకమారు ఆమెను కలుసుకొని, "ఏమిటి సంగతి, అమ్మాయి, నీ భర్త మాట్లాడనే మాట్లాడడు?" అన్నాడు. అమ్మాయి మొదట మాట్లాడగ ఊరుకొని తర్వాత అన్నదికదా, "నీతో ఏవిషయమై అతను మాట్లాడాలి? ఎవరిగొడవ వారిది.........మీగొడవ మీరు చూచుకొందురూ, పుణ్యముంటుంది."

అయితే యేమి, ఒకనెల గడవకుండా వారిద్దరూ స్నేహితులైనారు. సీమనున్నూ 'వాసిలీ' యున్నూ రైలు లైనుమీద కలుసుకొన్నప్పుడు వారిద్దరూ గట్టుమీద కూర్చొని పొట్టి పొగాకు గొట్టాలు వెలిగించి ఏరీతిగా జీవితం గడిపేరో చెప్పుకుంటూ ఉండేవారు. 'వాసిలీ' సాధారణముగా మాట్లాడేవాడు కాడు. కాని సీమన్ తన స్వగ్రామాన్ని గురించీ, యుద్ధాన్ని గురించీ చెప్పేవాడు.

"జీవితంలో యిన్నీ అన్నీ కాదు నేను పడ్డకష్టములు. కాని భగవత్కృపవల్ల అట్టేకాలం కష్టపడలేదు. భగవంతుడు నాకు అదృష్టం దయచేశాడు కాడు. పరమేశ్వరుడు ఎంత అదృష్టంయిస్తే అంతే. అదీ సంగతి, వాసిలీ ష్టిపేనిచ్" అని సీమన్ చెప్పాడు.

వాసిలీ ష్టిపేనిచ్ తన పొగాకు గొట్టములో నుసి రైలు పట్టామీద కొట్టి దులిపి నిలబడ్డాడు. "భగవంతుడిచ్చే అదృష్టం కాదు మనకు వ్యతిరేకంగా ఉంట, మనుష్యులు. మనుష్యులను మించిన క్రూరమృగములు ఎక్కడా లేవు. తోడేళ్ళు తోడేళ్లను తినవు; మనుష్యులు బ్రతికి ఉన్న యితర మనుష్యులను తింటారు." "అన్నా, కాదు; తోడేళ్ళు తోడేళ్ళను తింటవి. అబద్ధమంటావా?"

"అప్పటికి వచ్చిన మాట ఏదో అన్నాను. అయితే ఏమి? ఇంత కంటె క్రూరమైన మృగములు వేరేలేవు. మనుష్యుని దుర్మార్గతా, అశా, లేకపోతే బ్రతకవచ్చు. ప్రతివాడు నిన్ను బ్రతికివుండగా పట్టుకొని మ్రింగివేద్దామని వడుపువేసుకు ఉంటాడు—నోటితో కొరికి మ్రింగి వెయ్యడానికే."

సీమన్ ఆలోచించాడు.

"నాకు తెలియదు అన్నా. బహుశా అలాగు అయివుండవచ్చు; కాని, అలాగ అయినట్లయితే అది భగవదాజ్ఞ."

వాసిలీ అన్నాడుకదా, "అలాగయితే మనము ఒకరితో ఒకరు మాట్లాడతగ దేదీలేదు; మనకు జరిగే ప్రతి అన్యాయమూ భగవంతుని మీద పారవేసి కూర్చుని దుఃఖించే మాటయితే మనము మనుష్యులము కాము, పశువులము. నేను చెప్పేదదే."

అతడు వెనక్కుతిరిగి వెడతానని చెప్పకుండా వెళ్ళిపోయాడు. సీమన్‌కూడా లేచి నిలబడ్డాడు. "అన్నా, నాతో అంత కఠినంగా మాట్లాడతావేమి" అని వెనుకనుంచి కేకలేశాడు.

అతడు తిరిగి చూడలేదు. మలుపు దగ్గిర పల్లములో అతను దిగి అగుపించకుండా ఉండేదాకా అతనికేసి సీమన్ నిలబడి చూచాడు. అప్పుడతడు ఇంటికి తిరిగివచ్చి భార్యతో అన్నాడు, "అరీనా, మన పొరుగువాడు మాదొడ్డవాడు! వాడు మనిషికాడు, పగబట్టే మృగము."

అయినా వారిద్దరూ విరోధపడలేదు. త్వరలోనే వారిద్దరూ మళ్ళీ కలుసుకొని కూర్చుని పూర్వమువలెనే ప్రసంగించారు. ఎప్పుడూ ఒక్కటే విషయం.

“చూచావు. స్నేహితుడా, ఆ మనుష్యుల మూలాన్ని కాకపోతే మనము కావలాయిళ్ళలో కూర్చోనే కూర్చోము” అన్నాడు వాసిలీ. “కావలాయిళ్ళకేమి? అవి పాడుగాలేవు. వాసయోగ్యముగానే ఉన్నవి.”

“వాసయోగ్యమే. వాసయోగ్యమే. అంతకన్న నీవేమి చెప్పుతావు. ఇంతకాలము నీవు జీవించావు, ఏమీ నేర్చుకోలేదు. ఇంతకాలంనుంచి చూస్తున్నావు, ఏమీ చూడనేలేదు. కావలా యింటిలోనైతేనేమి, యితర సలాల్లో అయితేనేమి, బీదవాడు బ్రతికే బ్రతుకు ఏమాదిరిగా ఉంటుంది. నెత్తురు పీల్చేవాళ్ళు వాళ్ళు; నిన్ను బ్రతికి ఉండగానే తినేస్తారు; ఒక రక్తపుచుక్కైనా మిగలకుండా నిన్ను విడిచి పిప్పిచేసి నీవు ముసలివాడవైన తర్వాత పందులకు పనికివచ్చే తుక్కకింద తీసి పారవేస్తారు; నీకు ఎంత జీతమిస్తున్నారు?”

“కొంచమే వాసిలీష్టిపేనిచ్; 12 రూబుల్లు*, నాకు పదమూడున్నర; ఎందుకీతేడా ఉండాలి? కంపెనీ రూల్సు ప్రకారం మన అందరికీ ఒక్కటే జీతం. నెలకు పదిహేను రూబుళ్లు; దీపమూ, వంటచెరుకూ ఉచితం. నీకు పన్నెండు రూబుళ్లు, నాకు పదమూడున్నర రూబుళ్ళు ఇవ్వమని ఎవరు ఉత్తరువు చేశారు? అదీ నిన్నడగవలసిన ప్రశ్న. కాలక్షేపం చెయ్యవచ్చుగదా అంటావు కాబోలు! రూబులున్నర—వాళ్ళు పదిహేనూ ఇవ్వడం తటస్థించితే—మూడు రూబుళ్ళ తేడాకోసం నే చెప్పడంలేదు. క్రిందటి నెల రైల్వే డైరక్టరు యీ దారిని వెళ్ళినప్పుడు నేను స్టేషను దగ్గిర ఉన్నాను. అప్పుడు ఆయన్ని చూశాను. ఎన్నో గౌరవచిహ్నములున్న వాయనికి, ప్రత్యేకంగా ఒక బండి వేయించుకొని అందులో ఆయన ప్రయాణం చేస్తున్నాడు. ఇవతలికి వచ్చి ఆయన ప్లాటుఫారం మీద నిలబడ్డాడు .... నే నిక్కడ అట్టేకాలం ఉండేది లేదు. ఎక్కడకు తోస్తే అక్కడికి వెళ్ళిపోతాను.”

“ఎక్కడికి వెళ్ళుతావు నీవు, ష్టిపేనిచ్? పోసిద్యూ; ఇక్కడ నీకో యిల్లు ఉన్నది. వెచ్చగా ఉంటున్నావు; కాస్త పొలం ఉన్నది. పని చెయ్యగల భార్య ఉన్నది.”

---

* రూబులు సుమారు రెండు రూపాయలకు సమానము.

"కాస్తపొలం! నాకాస్తపొలంకేసీ నీవెప్పుడైనా చూచావా? ఒక రెమ్మైనా అందులో లేదు. పోయిన వసంత ఋతువులో కొన్ని కాబేజీలు అందులో మొలవేశాను. రోడ్డుమేస్త్రి వచ్చి, 'అప్లికేషన్ పెట్టుకొన్నావా? ఉత్తరువు పొందావా? ఈ క్షణంలో అవి లాగి పారవెయ్యి; వాట్ల అసవాళ్ళైనా అక్కడ ఉండడానికి వీలులేదు' అన్నాడు. అప్పుడు తప్ప త్రాగి ఉన్నాడేమో అలాగ అన్నాడు. ఇంకొకప్పుడైతే మాట్లాడక ఊరుకొనును. మంచీచెడ్డా తెలియని మత్తుస్థితిలో ఉన్నాడు .... "మూడు రూబుళ్ళు జుల్మానా!"

వాసిలీ తన పొగాకు గొట్టమును మాట్లాడకుండా కొంతసేపు పీల్చి ఈరీతిగా అన్నాడు. "అంతటితో సరిపెట్టేడు; లేకపోతేనా, చచ్చేటందుకు తన్ని వదలిపెట్టేవాడిని."

"కానీ, కానీ, అబ్బాయీ, నీవు తొందర మనిషివి; చెప్పుచున్నాగా."

"నేను తొందర మనిషిని కాను. సత్యాన్ని గురించే నేను ఆలోచిస్తూ ఉంటాను; సత్యాన్నే మాట్లాడుతాను. అవలేదు, వాడిపని పడతానులే. సెక్షను ప్రధానాధికారికి ఫిర్యాదు చేస్తాను."

అతడు ఫిర్యాదు చేశాడు.

సెక్షను ప్రధానాధికారి లైను పరీక్ష చేయడానికి వచ్చాడు; ఇంక మూడు రోజులకు 'పీటర్సుబర్గు' పట్టణము నుంచి కొందరు గొప్పవాళ్ళు ఆ దారిని రైలుమీద వెళ్ళబోతున్నారు. వాళ్ళు రావడానికి ముందు సమస్తమూ సక్రమంగా ఉండవలెను కాబట్టి లైను పరీక్ష జరుపవలసి వచ్చినది. అవసరమైనచోట మన్ను రాళ్ళు పట్టాలమధ్యపోసి దట్టించారు; ఎత్తుపల్లాలు సరిచేశారు; పట్టాలక్రింది అడ్డుదూలాలు పరీక్ష చేశారు. బంధాలు పట్టాలకు సరిగా ఉన్నవో లేవో అని సుత్తులతోకొట్టి చూచారు. మరమేకులు గట్టిగా బిగించారు. స్తంభాలకి కొత్త రంగులు పూశారు. లెవెలు క్రాసింగుల దగ్గిర పచ్చమన్ను చల్లారు. ముసలి కాపలావాని భార్య పట్టా ప్రక్కలను పెరిగిన మొక్కలను లాగి పారవేయడానికి అతనిని బయటకు పంపించింది. సీమన్ ఒకవారం బాగా కష్టపడి

అంతా రైటు చేశాడు. అతడు తన 'కాఫ్టన్'* ఉతికి బాగుచేసి చిరుగులు కుట్టుకొన్నాడు. డవాలీబిళ్ల ఇటికపొడుముతో ధగధగ మెరిసేలాగ తోమినాడు. వాసిలీకూడా చాలా కష్టపడి పనిచేశాడు. సెక్షను ప్రధానోద్యోగి తోపుడు బండిలో వచ్చాడు. నలుగురు కూలివాళ్లు ఆ బండి నడపడానికి పనిచేస్తున్నారు. బళ్ళచక్రాలు బజ్జుమని చప్పుడవుతున్నాయి. బండి గంటకు ఇరవై వెర్స్టుల వేగముతో పరుగెత్తుచున్నది. చక్రాలు హోరుమంటున్నవి. సీమన్ కాపలాయింటికి అది రంయని వచ్చింది; సీమన పరుగు పరుగున వెళ్ళి సిపాయివలె నిలబడి సర్వమూ నివేదించాడు. సమస్తమూ సక్రమంగా ఉన్నది.

"ఎంతకాలం నుంచి నీవు ఇక్కడ ఉంటున్నావు" అన్నాడు ప్రధానాధికారి.

"మే నెల రెండవతేదీ నుంచి దేవరా :"

"సరే, మంచిది నూటఅరవైనాలుగో నెంబరు దగ్గర ఎవరు ఉన్నారు ?"

తోపుడుబండిలో అతనితో కూడా వచ్చిన రోడ్డుమేస్త్రీ "వాసిలీ స్పిరిడోనావ్" అని చెప్పాడు.

"స్పిరిడోనోవ్, స్పిరిడోనోవ్.... ? ఉహూం. క్రిందటేడు చీవాట్లు తిన్నాడు వాడేనా ?"

"అవును వాడే."

"సరే చూద్దాము పోనియ్యి."

కూలివాళ్ళు తోపుడుబండి నడవడానికి పూనుకొన్నారు. బండి బయలుదేరింది. సీమన్ దానివైపు చూస్తూ అనుకున్నాడు "నా పొరుగువాడు ఏదో తమాషా చేస్తాడు మొత్తం మీద."

రెండుగంటలైన తర్వాత సీమన్ తనపని చేసుకోడానికి వెళ్లాడు. పల్లములో ఉండగా ఎవరో ఒక మనిషి లైనుప్రక్కనుంచి నడుస్తూ

---

* కాఫ్టన్ అనగా రసియాలో ప్రజలు తొడుగుకొను చొక్కా, నడుము దగ్గర పటకాతో బిగించడానికి వీలుగా ఉన్న చేతులు పొడుగు చొక్కా.

ఉన్నట్టు చూచాడు. అతనికి తలమీద ఏదో తెల్లగా ఉన్నట్టు కనిపిస్తోంది. సీమన్ జాగ్రత్తగా చూచాడు. వస్తూన్నవాడు 'వాసిలీ.' చేతులో ఒక కర్ర బుజంమీద ఒక మూటా పెట్టుకొని వస్తున్నాడు. ఒక చెంప మాత్రం జేబురుమాలుతో కట్టు కట్టుకొన్నాడు.

"ఎక్కడకు వెళ్ళుతున్నావోయ్ అబ్బాయి" అని సీమన్ కేక వేశాడు.

వాసిలీ చాలా సమీపానికి వచ్చాడు. అతని ముఖము వికలముగా ఉంది. సుద్దలాగ తెల్లబడిపోయినది. కళ్ళు ఉగ్రముగా ఉన్నవి. మాట్లాడడానికి ప్రయత్నించాడు కాని మాట సరిగా వచ్చిందికాదు. "నేను పట్టణానికి, మాస్కో, బోర్డుకు వెళ్ళుచున్నాను.

"బోర్డుదగ్గరకా .... .. అలాగా అలాగా ! ఫిర్యాదు చేయడానికి కాదూ ? వదలిపెట్టుదూ, వాసిలీ స్టిపెనిచ్, మరిచిపోదూ !"

"కాదన్నా, నేను ఎంతమాత్రమూ మరిచిపోను. మరిచిపోయే రోజులు వెళ్లాయి. చూడు నన్ను మొహంమీద ఎల్లా కొట్టాడో; రక్తం కారిపోతుంది. బ్రతికి ఉండగాను మరిచిపోతానా ? ఇలాగ వదలి పెడతానా ?"

సీమన్ అతనిచెయ్యి పట్టుకొన్నాడు. "వదలిపెట్టుదూ, స్టిపెనిచ్. నేను చెప్పేమాట సత్యం; ఇప్పుడున్న పరిస్థితులు బాగుపడవుసుమీ."

"పరిస్థితులు బాగుపడడమా ? నేను బాగు చెయ్యలేనని నాకు తెలుసును. భగవంతుడిచ్చే అదృష్టాన్ని గురించి నీవు చెప్పిన మాటా వాస్తవమే. నా అదృష్టం నేను బాగుచేసుకోలేను. కాని సత్యాన్ని అనుసరించవలసి ఉంటుందిగాదూ."

"ఏమిటి జరిగిందో చెప్పు."

"ఏమిటి జరిగిందా ! అన్నీ పరీక్ష చేశాడు. తోపుడుబండి దిగి ఇంట్లోకి వెళ్లాడు. జాగ్రత్తగా ప్రతీదీ పరిక్ష చేస్తాడని నాకు తెలుసు. అంచేతనే అంతా సరిగ్గా ఉంచాను. వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉండగా నేను ఫిర్యాదు చేశాను. నన్నుచూచి మండిపడి అన్నాడుగదా: 'ఇది గవర్నమెంటు తనిఖీ. ఇప్పుడు నీవు పాదులను గురించి ఫిర్యాదు

చెయ్యడానికి వచ్చావా ? ప్రీవీ సభ్యులకు సంబంధించిన విషయమిది. నీ కాబేజీల గొడవతో ఇప్పుడా రావడం ?' నేను అనకుండా ఉండలేక పోయాను. ఒక్కమాట అన్నాను. ఆట్టేలేదు. కాని అతనికి కోపం వచ్చింది. నన్ను మొహంమీద ఒక్కటివేశాడు; నేను అలాగ నిలబడి పోయాను. వాళ్ళు బండి తీసుకుపోయారు. నేను తెలివితెచ్చుకొని మొహం కడుక్కొని బయలుదేరాను."

"కాపలాయింటి సంగతి ?"

"నా భార్య అక్కడ ఉంది. ఆమె అంతా సరిగ్గా చూస్తూంది. వాళ్ళూ వాళ్ళరైళ్ళూ విరగడైపోను." వాసిలీ లేచి వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాడు.

"సెలవు, ఇవనిచ్ నాకు న్యాయం జరుగుతుందని చెప్పలేను."

"నడిచివెళ్లాలనా ప్రయత్నం."

"స్టేషను దగ్గిర బూర్సుబండిమీద వెళ్ళనివ్వమని అడుగుతాను. రేపు మాస్కోలో ఉంటాను." ఒకరివద్ద ఒకరు సెలవు తీసుకొన్నారు. వాసిలీ ప్రయాణమై వెళ్లాడు. చాలాకాలం అతడు ఎవరికీ కనిపించలేదు. అతని భార్య అతని పనంతా చేస్తున్నది. రాత్రింబగళ్ళు నిద్రలేదు. పెనిమిటికోసం కనిపెట్టుకు ఉండడంవల్ల సగమైపోయింది. మూడవ రోజున ఇన్స్పెక్టరుగారి రైలు ఆదారిని వెళ్ళింది. ఒక ఇంజనూ, ఒక సామానుబండి రెండు ఫస్టుక్లాసు బండ్లూను. వాసిలీ అప్పుడక్కడ లేనే లేడు. నాలవరోజున సీమన్ వాసిలీ భార్యను కలుసుకొన్నాడు. అస్తమానం ఏడవడంవల్ల ఆమె మొహం పొంగి ఉన్నది. కళ్ళు ఎర్రగా ఉన్నవి. "నీ పెనిమిటి తిరిగివచ్చాడా ?" అని ప్రశ్నించాడు.

ఆమె చెయ్యి ఆడించి ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయింది.

చిన్నతనములో సీమన్ 'విల్లో' శాఖలతో పిల్లంగ్రోవులు చెయ్యడం నేర్చుకొన్నాడు. విల్లో కర్రలో బెండు ఊడకొట్టి అవసరమైనచోట్ల రంధ్రాలు పొడిచి చివర పీపిచేసి ఎంతో బాగా ఏపాటపడితే ఆపాట పాడడానికి వీలుగా ఉండేటట్లు పిల్లంగ్రోవులు చేసేవాడు. పని లేక ఖాళీగా ఉన్నప్పుడు చాలా గొట్టాలుచేసి బూర్సుబండి గార్డుకూ,

తనకూ, పరిచయం వుండడంవల్ల అతని ద్వారా పట్టణం పంపించే వాడు. మార్కెట్టులో అమ్మగా ఒక్కొక్కదానికి రెండు కోపెక్కుల* వంతున అతనికి ముట్టేది. తనిఖీ అయిన మూడోరోజున, అరుగంటల బండి చూడడానికి భార్యను యింటివద్ద అట్టేపెట్టి కత్తితీసుకొని పిల్లం గ్రోవులకు కర్రలను కొట్టడానికి అతను అడవిలోకి వెళ్లాడు. తన బీటు చివరదాకా వెళ్లి రైలుమార్గం మోచేతిమలుపు తిరిగినచోట గట్టుదిగి అడవిలోనికి వెళ్లాడు. అరవెర్‌స్టు దూరంపైన ఒక పెద్ద తేమ ప్రదేశ మున్నది. దాని సమీపంలో పిల్లంగ్రోవులు చెయ్యడానికి అనుకూలంగా ఉండే విల్లోకర్రలు దొరుకుతవి. ఒక మోపుకర్రలు కొట్టి యింటికి వెడదామని బయలుదేరాడు; అడవిలోనుంచి నడుస్తున్నాడు. సూర్యుడు పడమర అస్తమించబోతున్నాడు. అంతా నిశ్శబ్దము. పక్షుల రుతు ములూ, కాలిక్రిందపడ్డ ఎండాకుల చప్పుడూ మాత్రం వినపడుచున్నవి. సీమన్ మరికొంతదూరం నడిచాడు. రైలు పట్టాలు సమీపించాడు. ఒక లోహపు వస్తువుమీద ఇంకో లోహపు వస్తువును కొట్టితే పుట్టే శబ్దము వంటి శబ్దము అతను విన్నట్టు భావించాడు. సీమన్ వడివడిగా నడుస్తు న్నాడు. ఆ ప్రాంతాల రైలుపట్టాలకు ఏమీ మరమ్మతులు లేవు. “ఏమిటి ఈ శబ్దము” అని అతడాలోచించాడు. అడవి పొలిమేర దాటాడు. రైలు గట్టు కనిపించింది. రైలులైనుమీద ఎవరో కూర్చుని ఏమో చేస్తున్నారు. నెమ్మదిగా సీమన్ అతన్ని సమీపించాడు. ఎవరో మరమేకులు ఎత్తుకు పోవడానికి వచ్చారని అతడనుకున్నాడు. సీమన్ చూచాడు. ఆ మనిషి లేచాడు. అతని చేతులో గునుపమున్నది. దానిని ఒక పట్టాక్రింద పెట్టి ఒక వైపుకు కదిపాడు. సీమన్ కళ్ళు చీకట్లు గ్రమ్మినవి. కేక వేదా మనుకున్నాడు. మాటరాలేదు. ఆ మనిషి వాసిలీ అని అతడు చూచాడు. అతనికేసి గబగబ పరుగెత్తుకు వెళ్ళాడు. వాసిలీ గునపమూ, రెంచీ చేత్తో పుచ్చుకొని గట్టు అవతలవైపు నుంచి పారిపోయాడు.

“వాసిలీ స్టిపెనిచ్! అన్నా! నాయనవు గావు! తిరిగిరావు! గునపము నాకియ్యి! రైలుపట్టా యధాప్రకారం పెట్టుదాము. ఎవరికి

---

* ఒక కోపెక్కు రూబుల్‌లో నూరోవంతు నాణెము.

తెలియదులే. తిరిగిరా, పాపపంపకం తగలకుండా నీ ఆత్మను కాపాడుకో!"

వాసిలీ తిరిగి రాలేదు. అడవిలోకి వెళ్లిపోయాడు.

ఊడదీసిన పట్టాదగ్గిర సీమన్ నిలబడ్డాడు. కర్రలమోపు క్రింద పారవేశాడు. అప్పుడు వచ్చేబండి సామానుబండి కాదు. ప్రయాణీకు లుండే బండే. దాన్ని ఆపడానికి అతనివద్ద సాధనాలేమీ లేవు. జెండాలు లేవు. వట్టిచేతులతో రైలుపట్టా సరియైన స్థలంలో పెట్టడము సాధ్యము కాదు. మేకులు బిగించడమూ సాధ్యము కాదు. ఎక్కడికేనా పరుగెత్తాలి. సాధనాలు తేవడానికి తప్పకుండా అతను తన యింటికి పరుగెత్తవలసి ఉన్నది. భగవంతుని సహాయం ఉండాలి!

వగర్చుకొంటూ సీమన్ యింటివైపు పరుగెత్తాడు. పరుగెత్తుతున్న ప్పుడు ఏక్షణం క్రిందపడిపోతానో అని అనుకున్నాడు. అడవి వెలువడి పరుగెత్తాడు. అతని యింటికి యింక దూరం సుమారు రెండువందల గజాలు ఉన్నది. మిల్లు తాలూకు కూత అప్పుడే వినిపించింది. ఆరు గంటలయింది. ఆరుగంటల రెండు నిమిషములకు రైలుబండి రానై ఉన్నది. కరుణామయుడా! భగవంతుడా! ఏపాపమూ ఎరగని ప్రయా ణీకులను కాపాడవా! సీమన్‌కు జరగబోయే సంగతి అంతా కనిపిస్తూనే ఉంది. 'ఇంజను వస్తుంది. ఊడదీసిన పట్టాతో దాని ఎడమవైపు చక్రాలు తగులుకుంటవి. ఇటూ అటూ ఊగులాడుతుంది. తిరగబడుతుంది. రైలుపట్టాలను పైకి లాగుకుపోతుంది. పట్టాక్రింద దూలాలు వదలి పోతవి. సరిగా అక్కడే లైను మలుపుతిరిగింది; గట్టు ఇరవై అయిదు గజాలు ఏటవాలుగా ఉన్నది అక్కడ. ఆ రైలుబండిలో మూడోక్లాసు బం... .... స్త్రీలు, చిన్నపిల్లలు క్రిక్కిరిసి కూర్చుని ఉంటారు .... ఏమి వస్తుందో తెలియకుండా వారంతా కూర్చుంటారు. భగవంతుడా! ఏమి చెయ్యమన్నావు. ఎంతగట్టిగా పరుగెత్తినా ఇంటికివెళ్ళి తిరిగి రావడమునకు వ్యవధి చాలదు ...! సీమన్ యింటికి వెళ్ళలేదు. అంత కన్న వడిగా పరుగెత్తుకొంటూ వెనకకు వెళ్ళాడు. ఒళ్ళుతెలియకుండా తరవాత క్షణంలో ఏమి జరుగబోతుందో తెలియకుండా పరుగెత్తాడు.

రైలు ఊడదీసిన స్థలానికి పరుగెత్తి వెళ్ళాడు. అతడు పడవేసిన కర్రల మోపు అక్కడే ఉన్నది. వంగి వొక కర్ర తీసుకొని — ఎందుకో తెలియదు—ఇంకా ముందుకు పరుగెత్తాడు. రైలుబండి వస్తూన్నట్టు అతను భావించాడు. దూరమునుంచి రైలుకూత వినిపించింది. రైలుపట్టాలు కొంచెము కొంచెము అదురుతున్నవి. ఇంకా పరుగెత్తడానికి అతనికి శక్తిచాలదు. పట్టా ఊడదీసిన స్థలానికి రెండువందల గజాలు ముందు ఆగాడు. ఆ క్షణంలోనే అతడు ఏమి చేయవలసివుంటుందో ఛట్టున తట్టింది. తన టోపీ తీసివేశాడు. అందులోనుంచి వొక జేబురుమాలు తీశాడు. తన కాలిజోడులోనుంచి కత్తిని పైకి లాగాడు. సిలువవంటి చిహ్నము తనముందు వ్రేలితో గాలిలో వేసుకొన్నాడు. భగవంతుడా రక్షించు!

మోచేతికి పైన ఎడమ దండలో కత్తిని గుచ్చాడు. వేడి నెత్తురు ప్రవాహము ఉబికివచ్చింది. జేబురుమాలు ఆ రక్తముతో తడిపాడు, ముడుతలుతీశాడు. విడదీసి కర్రకుకట్టాడు. ఎత్తుగా ఎత్తి పట్టుకొన్నాడు —అతని ఎర్రజెండా.

జెండా ఊపుతూ అక్కడే నిలుచున్నాడు. అప్పుడే అతడు రైలు బండి చూచాడు. ఇంజను డ్రైవరు మాత్రం అతనిని చూడలేదు. బండి సమీపిస్తుంది. రెండువందల గజాల దూరంలో బరువుబండి ఆపడం ఎవరికీ శక్యంకాదు.

దెబ్బనుంచి రక్తము ఊరికే కారిపోతోంది. చేతిని ప్రక్కకు అణచిపెట్టాడు. దానివల్ల ప్రవాహం కట్టువడుతుందనుకొన్నాడు. కాని రక్తం ప్రవహిస్తూనే ఉంది. రెక్కలోపడ్డ గాయం లోతుగా ఉంది. అతనికి తల తిరుగుతోంది. కళ్ళముందర నల్లటి ఈగలు ఎగురుతూన్నట్లు అయింది....... కళ్లు చీకట్లు గ్రమ్మినవి... ....చెవుల్లో గంటలు వాయించిన శబ్దము వినబడుతోంది. బండి అతనికి అవుపించడంలేదు. దాని శబ్దము వినిపించడంలేదు .... అతని మనస్సులో వొక్కటే అలోచన! "నేను నిలబడలేను — నేను పడిపోతాను — జెండా క్రింద పడవేస్తాను — బండి నామీదనుంచి పోతుంది; అయ్యో! దేవుడా!

రక్షించవా………!" అతని కళ్లు మసకలు గ్రమ్మినవి. మనస్సు శూన్యమైనది. జెండా వదలివేశాడు. నెత్తురు జెండా క్రిందపడలేదు. ఎవరిచెయ్యో దానిని పట్టుకొన్నది. ఎవరిచెయ్యో దానిని వచ్చే బండికేసి పైకెత్తి ఉంచింది. ఇంజను డ్రైవరు దానిని చూచాడు. వాల్వుమూసివేశాడు. ఇంజను మరల వెనక్కు త్రిప్పాడు. రైలుబండి ఆపివేశాడు.

ప్రయాణీకులు బళ్లుదిగి గుంపులు గుంపులుగా వచ్చారు. వాళ్లంతా రక్తంతో ఒకడు స్మృతితప్పి పడిఉండడం చూచారు. ఇంకొకడు అతని ప్రక్క నిలబడి కర్రకు కట్టిన నెత్తురు జెండా ఎత్తిపట్టుకొని ఉండడం చూచాడు.

వాసిలీ వొకమాటు చుట్టూచూచి తలవంచుకొన్నాడు.

అతడన్నాడు, "నన్ను కట్టివేయండి. రైలుపట్టా ఊడదీసింది నేను."

—:o:—